ప్రజాశక్తి

శుక్రవారం 20 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు



- ఆర్‌టిఇ ఉచిత సీట్లపై పాఠశాల యాజమాన్యాలు తాత్సారం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)సి ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా సీట్లు పొందిన విద్యార్థులకు వివిధ పాఠశాలలు అడ్మిషన్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాయి. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై వారం దాటినా అడ్మిషన్ ప్రక్రియ పూర్తి కాకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 10వ తేదీ నాటికి అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాలని విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యాశాఖ అధికారులు ఆదేశించినా ఆయా పాఠశాలలు మాత్రం లెక్కే చేయట్లేదు. అడ్మిషన్ ఇవ్వని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటనలిస్తున్నా వారిలో మాత్రం ఎలాంటి స్పందనా కనిపించట్లేదు.

స్థానిక లక్ష్మీపురంలోని ఓ పాఠశాల, బ్రాడీపేటలోని పేరొందిన పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు రిపోర్ట్ చేద్దామని వెళ్లగా తమకు ప్రభుత్వం నుండి స్పష్టత రావాల్సి ఉందని చెబుతూ అడ్మిషన్లు దాట వేస్తున్నారు. నగరంలోని దాదాపుగా అన్ని పాఠశాలల పరిస్థితీ ఇదే విధంగా ఉంది. గుంటూరు నగరంతోపాటు, జిల్లా మొత్తంగా 165 మంది విద్యార్థుల అడ్మిషన్‌పై యాజమాన్యాలు నిర్ణయం ప్రకటించలేదు. వీటిలో గుంటూరు నగరంలోనే వందకుపైగా సీట్లకు సంబంధించి అడ్మిషన్లు ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులే అమలు కాకపోవటంతో తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి దశగా 1150 సీట్లు ప్రభుత్వం ఆర్‌టిఈ కింద ఉచితంగా మంజూరు చేసింది. ఆయా విద్యార్థులను జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అడ్మిషన్ ఇవ్వాల్సి ఉంది. అయితే 789 మందికి మాత్రమే సీట్లు ఇచ్చినట్లు తెలిసింది. మిగిలిన వాటిలో 165 మందికి అసలు సీట్లు ఇస్తారా....? లేదా..? అనే విషయం తేల్చకుండా యాజమాన్యాలు పెండింగ్‌లో పెట్టారు. కొందరి విద్యార్థుల సమాచారం సరిగా లేకపోవటం, తల్లిదండ్రులు రిపోర్ట్ చేకపోవటంతో ఆయా సీట్లు భర్తీ చేయలేదు. ఈ విధంగా మొత్తంగా మంజూరైన సీట్లలో 70 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. అడ్మిషన్ ఇవ్వని పాఠశాలల్లో కార్పొరేట్, పెద్ద పెద్ద ప్రైవేటు విద్యా సంస్థలకే ఎక్కువగా ఉన్నాయి.

ఫీజుల సమస్య...

ఉచిత సీట్లకు సంబంధించి యాజమాన్యాలు ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న ఫీజులు సరిపోవట్లేదనే వాదన ముందుకు తీసుకొస్తున్నాయి. ఒక్కొక్క పాఠశాల బడ్జెట్ స్కూల్స్ అయితే రూ.20 2లో

సచివాలయాలకు పరుగులు

- తల్లికి వందనం వర్తించక ధ్రువపత్రాల సమర్పణ
- ఆరెంచెల నిబంధనలతో పలువురికి అనర్హత
- వాటిని సరిచేయించుకునేందుకు లబ్ధిదారుల పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు పలువురికి నిబంధనలు ప్రతిబంధకంగా మారాయి. ఈ పథకంలో అనర్హత కలిగిన వారి జాబితాలు సచివాయాలు, ఎంఈవోల కార్యాలయాలకు చేరాయి. గత ఐదు రోజులుగా జాబితాలను పరిశీలించి తిరిగి గ్రీవెన్సు ద్వారా ఫిర్యాదులను నమోదుకు సచివాలయాల్లో అవకాశం కల్పించారు. గ్రీవెన్సులో దరఖాస్తులు అందించేందుకు శుక్రవారం చివరి తేదీగా ప్రకటించడంతో రోజులుగా మహిళలు తమ పిల్లల వివరాలతో సచివాయాలకు పరుగులు పెడుతున్నారు. కొంత మందికి తగిన వివరాలు లభ్యం కాక ఇబ్బంది పడుతున్నారు.

పథకానికి అర్హత సాధించాలంటే బియ్యం కార్డు తప్పని సరిగా ఉండాలి. చాలామంది తల్లిదండ్రులకు పిల్లలకు సంబంధించి యుడిఐఎస్‌ఇ నంబరు తెలియక సచివాయాల నుంచి పాఠశాలలకు పరుగులు పెడుతున్నారు. 300 యూనిట్ల కరెంటు బిల్లులకు సంబంధించి విద్యుత్ కార్యాలయాలకు వెళ్తున్నారు. తమకు సంబంధం లేకుండా తమ పేరున కారు లేదా ఐటి రిటర్నులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు కూడా ఆయా కార్యాలయాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగిన వారికి కూడా 300 యూనిట్లు దాటితే అనర్హత జాబితాలో ఉంచారు. వీరంతా గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు జాబితాలు కావాలని విద్యుత్ అధికారులను కోరుతున్నారు. వీటిని స్థానిక ఏఈలు ధ్రువీకరించి ఇవ్వాల్సి ఉంది. విద్యార్థులు, వారి తల్లి, తండ్రి లేదా సంరక్షకుల ఆధార్ నంబర్లు చెల్లుబాటులో ఉండాలి. వీటిల్లో తప్పులున్నా అనర్హుల జాబితాల్లోకి వెళ్లారు. కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించి ఉండరాదు. పట్టణాల్లో 1000 చదరపు అడుగులకు మించిన విస్తీర్ణంలో ఇల్లు ఉండకూడదు. భూములు మాగాణి అయితే 3 ఎకరాలు, మెట్ట 10 ఎకరాలకు మించి ఉండరాదు. ఇంట్లో ఎవ్వరికీ నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. ఈనెల 28 వరకు 2లో

పెదనందిపాడు, ప్రత్తిపాడు, గుంటూరులో

పొగాకు కొనుగోలు కేంద్రాలు పెట్టాలి

- నాణ్యత, తేమ సాకులతో ధర తగ్గించొద్దు
- కొనుగోళ్లలో సమస్యలపై ప్రభుత్వం పర్యవేక్షించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - కాకుమాను

విలేకర్లతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

పొగాకు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెదనందిపాడు, ప్రత్తిపాడు, గుంటూరులో ఏర్పాటు చేయాలని రైతుసంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కాకుమానులోని విష్ణాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పర్చూరు మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు ప్రారంభించడం హర్షణీయమని, అయితే మంత్రి చెప్పినట్లు రైతుల వద్ద ఉన్న చివరి కాడ వరకూ కొంటామనే హామీ ప్రకారం కొనుగోళ్లను నిత్యం పర్యవేక్షించాలని కోరారు. సరిగా కొనుగోలు చేస్తున్నారా లేదా? రైతులనేమైనా ఇబ్బంది పెడుతున్నారా? అని తెలుసుకుంటూ సమస్యలుంటే సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. తేమశాతం, ఆకు నాణ్యత బాగోలేదంటూ ఆంక్షలతో కొనుగోలు చేయకుండా తిరిగి పంపించకుండా చూడాలన్నారు. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి, కౌలు కలిపి మొత్తంగా రూ.లక్షన్నర వరకు పొగాకు రైతులకు ఖర్చయిందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని క్వింటాళ్‌కు రూ.12 వేలకు తగ్గకుండా కొనాలని డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చి నాలుగు నెలలైనా కంపెనీలు కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వం కొనుగోలు కేంద్రం పెట్టకపోవడం వల్ల పొగాకు నాణ్యత తగ్గుతుందని, దీనికి రైతులను బాధ్యులను చేయెద్దని అన్నారు. మిర్చి, పొగాకు తదితర పంటలకు మద్దతు ధరల్లేక ఇప్పటికే 8 2లో

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు 14 పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా అథ్లెట్లు 14 పతకాలు సాధించారు. వీటిల్లో ఐదు బంగారు, ఐదు రజత, నాలుగు కాంస్య పతకాలున్నాయని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను సంఘం చైర్మన్ జి.శేషయ్య, ఏఐసీసీ కార్యదర్శి జి.ఉషారాణి అభినందించారు. మెడల్స్ సాధించిన వారిలో ఎస్‌కె మొహిద్దీన్ (హై జంప్-గోల్డ్), డి.మణికంఠ (హ్యామర్ త్రో-గోల్డ్), కె.రెష్మి (జావెలిన్ త్రో - గోల్డ్), అంకమ్మ (5కె రన్ - గోల్డ్), ఎవిజి కృష్ణమ నాయుడు (జావెలిన్ త్రో - సిల్వర్), రవికిరణ్ (110 మీటర్ల హర్డిల్స్ - సిల్వర్), శంకర్ (డెకత్‌లోన్ - సిల్వర్), వైష్ణవి (డెకత్‌లాన్ - సిల్వర్), ప్రసన్నకుమార్ (షాట్‌పుట్ - సిల్వర్), ప్రసన్నకుమార్ (100, 110 మీటర్ల హర్డిల్స్ - సిల్వర్), ప్రవీణ్‌కుమార్ (400 మీటర్లు, సిల్వర్), గురు శంకర్ (400 మీటర్ల - బ్రాంజ్) ఉన్నారు.

రాజధానిలో కార్మికుల నివాసాలను పరిశీలిస్తున్న ఎడిబి,ప్రపంచ బ్యాంకు బృందం

రాజధానిలో

ప్రపంచ బ్యాంకు, ఎడిబి బృందం పర్యటన

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) బృందం గురువారం రాజధాని అమరావతిలో పర్యటించింది. బృందం సభ్యులు తొలుత విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో రాజధాని నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు, కార్మికుల ఆరోగ్య భద్రత తదితర అంశాలపై జరిగిన ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అమరావతి నిర్మాణ కార్యకలాపాల్లో పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, పని ప్రదేశంలో కార్మికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను గురించి బృందానికి సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ వివరించారు. రాజధాని అమరావతిలో నివసిస్తున్న ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన గురించి వివరించారు. లింగవివక్ష, బాలకార్మికులకు తావు లేకుండా అమరావతి నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రైతులు,రాజధాని ప్రాంతవాసుల సమస్యలను ఎప్పటికప్పుడు అర్జీల రూపంలో స్వీకరించి సత్వరం పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

బృందంలోని సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ 2లో

స్థల వివరాలపై అధికారులతో చర్చిస్తున్న ఆర్‌డిఒ మధులత

రైల్వే బ్రిడ్జి కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి స్థలాన్ని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత గురువారం పరిశీలించారు. ఆర్ అండ్ బి, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. అండర్ బ్రిడ్జి లేదా ఫ్లైఓవర్ నిర్మాణానికి సమగ్ర అంచనాలతో ఉన్నతాధికారులకు నివేదిస్తామని, నిర్మాణం త్వరగా చేపడతామని అన్నారు. ఆర్డీవో వెంట మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, తహశీల్దార్ సురేష్ ఉన్నారు. గతంలో ఏనుగుపాలెం రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు కాగ రెండేళ్ల దాటిన నిర్మాణానికి నోచుకోలేదు. వినుకొండ పట్టణంలో నూజెండ్ల రోడ్డు, ఏనుగుపాలెం రోడ్‌లోని రైల్వే ట్రాక్‌ల వద్ద అండర్ బ్రిడ్జిలు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నూజెండ్ల దారిలో రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. ఏనుగుపాలెం రోడ్డులో బ్రిడ్జి నిర్మాణాన్ని నిలిపివేశారు. ఏనుగుపాలెం రోడ్డు అద్దంకి - ఒంగోలు ప్రధాన రహదారి అవడంతో నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రైల్వే గేటు పడిన సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రాలు పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇవి ప్రభుత్వ హత్యలుగానే తాము పరిగణిస్తున్నామని చెప్పారు. రైతులు కూడా ప్రైవేటు కంపెనీల మాయమాటలు నమ్మి తక్కువ రేటుకు అమ్ముకోవద్దని, అప్పులతో భయపడి ఆత్మహత్యలకు పాల్పడొద్దని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటశివరావు మాట్లాడుతూ పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో 20 గ్రామాల్లో రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేశారని, రెండు మండలాలకు కేంద్రంగా ఉన్న పెదనందిపాడు మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రాజేంద్ర, కె.ప్రభుదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

(మొదటి పేజీ తరువాయి)

వేలకుపైగా, కార్పొరేట్ స్కూల్స్, పెద్ద పెద్ద స్కూల్స్ రూ.35 వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఉచిత అడ్మిషన్ల ఫీజుల ఈ విషయంలో కొన్ని యాజమాన్యాలు కోర్టుకు కూడా వెళ్లాయి. వాస్తవానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలి. అయితే ప్రభుత్వం కొంతమేర ఫీజులు చెల్లిస్తున్నా యాజమాన్యాలు సీట్లు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో కూడా ఆర్‌టిఇ అడ్మిషన్లు ఇచ్చారు. 2024-25 అడ్మిషన్ల విషయంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు జమ చేయకపోవటంతో యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు, అవమానాలకు గురి చేశాయి. దీనిపై పెద్ద సంఖ్యలో ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేశాయి. పెండింగ్ ఫీజులు రావాల్సి ఉందని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫీజుల విషయంలో కూడా స్పష్టత కోసమే యాజమాన్యాలు అడ్మిషన్లు తిరస్కరిస్తున్నాయని తెలిసింది. ప్రభుత్వ ఆదేశాలను పక్కన పెట్టిన ఫీజుల కోసం అడ్మిషన్లు నిలిపివేయటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆంక్షల ఉల్లంఘనపై చట్టపరమైన చర్యలు

డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహా పలువురిపై కేసులు : పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్లలో బుధవారం పర్యటన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించారని, ద్విచక్ర వాహన ర్యాలీతో పాటు అనుచిత వ్యాఖ్యలతో కూడిన పోస్టర్లను ప్రదర్శించి పూర్తి స్థాయిలో పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తూ పర్యటన సాగిందని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. జగన్ పర్యటనకు ఆంక్షలతో కూడిన అనుమతులివ్వగా, వాటికి పూర్తి విరుద్ధంగా కార్యక్రమం జరిగిందన్నారు. పోలీసులపై ప్రజా ప్రతినిధులు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయని, ప్రజా ప్రతినిధులు సైతం వారి అనుచరులతో తిరిగారని చెప్పారు. వీటన్నింటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు వైసిపి నాయకులపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

రూ.1.67 లక్షల విత్తనాలు సీజ్

ప్రజాశక్తి - అచ్చంపేట : సరైన ధ్రువపత్రాలు లేని పత్తి, మిర్చి విత్తనాల ప్యాకెట్లను గుర్తించామని మండలం వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. వేల్పూరు గ్రామం వద్దగల పుల్లారెడ్డి సీడ్స్ విత్తన దుకాణంలో విజిలెన్స్ ఏవో ఆదినారాయణ, సిఐ శివాజీ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా సరైన ధ్రువపత్రాలు లేకుండా ఉన్న 15 కిలోల 730 గ్రాములు పత్తి, మిర్చి విత్తనాలను గుర్తించామని, వీటి విలువ రూ.లక్షా 67 వేల 630 ఉంటుందని చెప్పారు. వాటిని సీజ్ చేశామన్నారు. మిగతా దుకాణాల్లోనూ తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు.

సింగయ్య మృతి కారకులపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రెంటపాళ్లలో వైసిపి అధినేత జగన్ పర్యటన నేపథ్యంలో వెంగళాయపాలెం వద్ద సింగయ్య మృతికి కారకులపై కేసు నమోదు చేయాలని, జగన్‌తోపాటు మాజీ మంత్రి అంబటి రాంబాబులపై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు పెట్టాలని రాష్ట్ర ఎస్‌సి (ఎమ్‌డి) వెల్ఫేర్ కో-ఆపరేటివ్, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్‌పి జెవి సంతోష్‌కు ఆయన గురువారం ఫిర్యాదు చేశారు.

సచివాలయాలకు పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన తల్లుల, తండ్రుల విద్యార్థుల జాబితాలను తయారు చేసి 30న గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలి. విద్యార్థులు తమ పేర్లను ఆయా పాఠశాలల్లో నమోదు చేసుకుంటేనే వారికి తల్లికి వందనం వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో గుంటూరు జిల్లాలో మొత్తం 2,97,993 మంది విద్యార్థులు చదివారు. పల్నాడు జిల్లాలో 3,00,961 మంది విద్యార్థులు ఒకటి నుంచి 10 వరకు చదివినట్టు అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో ఒకటో తరగతికి ఈ ఏడాది కొత్త చేరే వారు, టెన్త్ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదివే వారి పేర్లు కొత్తగా నమోదు ప్రక్రియ కొనసాగుతుండగా అధికారులు రూపొందించిన అర్హులుగా జాబితాల్లో 2,01,911 మంది పేర్లు తల్లికి వందనం జాబితాల్లో వచ్చాయి. అయితే 2,97,993 మందిలో టెన్త్ చదివిన వారు దాదాపు 28 వేల మంది ఉన్నారు. వీరిని మినహాస్తే ఇంకా దాదాపు 70 వేల మంది అనర్హత జాబితాల్లో ఉన్నారు. కొంతమంది పేర్లు అర్హత, అనర్హత జాబితాల్లో లేకపోవడం వల్ల వారు కూడా తిరిగి సచివాలయాల్లో గ్రీవెన్సు సమర్పిస్తే అధికారుల కమిటీ పరిష్కరిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. 70 వేల మందిలో గురువారం వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సచివాయాల్లో దాదాపు 30 వేల మంది మాత్రమే తిరిగి గ్రీవెన్సులో దరఖాస్తు చేసుకోగలిగారు. ఇంకా 40 వేల మంది గ్రీవెన్సు దాఖలు చేసేందుకు తగిన పత్రాలు లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. పల్నాడు జిల్లాలో తల్లికి వందనం పథకానికి 2,47,393 మంది అర్హులుగా ఉన్నారు. మొత్తం 3,00,961 మంది గత విద్యా సంవత్సరంలో చదివారు. వీరిలో పదోతరగతి విద్యార్థులు 25 వేల మంది ఉన్నారు. ఇంకా 28 వేల మంది అనర్హుల జాబితాల్లో ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు కేవలం 18 వేల మంది మాత్రమే తల్లికి వందనం గ్రీవెన్సులో సచిలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. 10 వేలమంది శుక్రవారం సాయంత్రంలోగా గ్రీవెన్సులో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

ప్రపంచ బ్యాంకు, ఎడిబి బృందం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

బాయన వెంకటరావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా ఉన్న పర్యావరణ, సామాజిక వ్యవస్థల అసెస్‌మెంట్ ప్రక్రియపై సూచనలను వివరించారు. రీసెటిల్మెంట్ యాక్షన్ ప్లాన్, పాలసీల గురించి మాట్లాడారు. అనంతరం బృందంలోని సామాజిక రక్షణ కార్యకలాపాల సలహాదారు రంజన్ వర్మ, బాయన వెంకటరావు అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల బాధ్యతలను, పర్యావరణ, సామాజిక సంక్షేమ కార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న వివిధ సంస్థలు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై చర్చించారు. రాజధాని ప్రాంతవాసులు, కార్మికులకు వచ్చే సమస్యల పరిష్కారం గురించి వివరించారు.

బృందంలోని సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్ జోసెఫ్, పర్యావరణ సంరక్షణ కార్యకలాపాల సలహాదారు దమన్‌జిత్ సింగ్ మిన్హాస్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టర్లు పాటించాల్సిన సామాజిక రక్షణ కార్యకలాపాలు, పర్యావరణ పరిరక్షణ, అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన సురక్షిత విధానం, కార్మికుల భద్రత తదితర అంశాలను వివరించారు. బృందంలోని మహిళా ప్రతినిధి జయశర్మ మాట్లాడుతూ లైంగిక దాడి, హింస తదితర ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన గోప్యత, బాధితులకు అందించాల్సిన సహాయం తదితర అంశాలను వివరించారు. అనంతరం రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మాణ పనులు జరుగుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, శాఖమూరు రిజర్వాయర్, ఎల్పీఎస్ జోన్ 2ఎ ప్రాజెక్టు సైట్, కార్మికుల క్యాంపులను బృందంతోపాటు సిఆర్‌డిఎ అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఆయా సైట్లలో పనిచేస్తున్న కార్మికులతో బృందం మాట్లాడింది. కాంట్రాక్టు సంస్థలు క్యాంపుల్లో అందుబాటులో ఉంచిన మౌలిక సదుపాయాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిఆర్‌డిఎ, ఎడిసిలోని చీఫ్ ఇంజినీర్‌లు సిహెచ్ ధనుంజయ, ఎన్.శ్రీనివాసులు, ఎం.ప్రభాకరరావు, ఎస్ఇ ఆర్ హనుమంతరెడ్డి, డిఇ పి.వెంకటేశ్వర్లు, ఈఈ కె.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు అందని 'తల్లికి వందనం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక కేంద్రీయ విద్యాలయంలో పలువురికి తల్లికివందనం పథకం వర్తించకపోవడంపై తల్లిదండ్రులు కంగారు పడుతున్నారు. ఇక్కడ 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 400 మంది ఇక్కడ చదువుతున్నారు. విద్యార్థుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో ఇతర పిల్లలనూ చదువుతున్నారు. 25 శాతం మంది పేద కుటుంబాల విద్యార్థులే అయినా వారికి నగదు జమకాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఇఒ తెలిపారు.

ప్రముఖ న్యాయవాది కెనడి గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - మాచర్ల

గుంటూరు, మాచర్ల న్యాయస్థానాలలో న్యాయవాదిగా పనిచేస్తున్న పట్టణానికి చెందిన కెనడి (64) గుండెపోటుతో హైదరాబాదులోని ఒ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. సుదీర్ఘకాలంగా మాచర్ల న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న కెనడి అభ్యుదయవాదిగా, ప్రజాసంఘాల నాయకుడిగా సుపరిచితం. మాచర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా, మాచర్ల నియోజకవర్గ బహుజన్ సమాజ్ వాది పార్టీ ఇన్‌ఛార్జిగా పని చేశారు. ఆయన అధ్యక్షునిగా ఉన్న కాలంలో మాచర్లకు బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరామ్‌ని, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సమాజ్ వాది పార్టీ వ్యవస్థాపకులు ములాయంసింగ్ యాదవ్ కూడా మాచర్ల వచ్చారు. కెనడీ మృతి పట్ల తన సహచర న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

తహశీల్దార్ దృష్టికి వినియోగదార్ల సమస్యలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌ను వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ప్రతినిధులు గురువారం కలిశారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. గ్యాస్ డెలివరీ ఛార్జీలు, గ్యాస్ సిలిండర్లు డెలివరీ లోపాలు, పెట్రోల్ బంకుల నిర్వహణలో లోపాలును వివరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులపై రూపొందించిన పోస్టర్‌ను తహశీల్దార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం పల్నాడు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రసాద్, అధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రవి నాయక్, కోశాధికారి బేబీ విక్రమ్, కార్యదర్శి పోలయ్య పాల్గొన్నారు.

పథకాలు అందని రైతులు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - యడ్లపాడు

భూముల రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో జాయింట్ ఎల్పీఎంతో ఇబ్బంది పడుతున్న రైతులు సబ్ డివిజన్‌కు కల్పించిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని నరసరావుపేట సర్వే శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన తహశీల్దార్ విజయశ్రీతో సమావేశమయ్యారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకే జాయంట్ ఎల్పీఎంతో 10 ఎకరాలకు మించి ఉండటంతో కొందరు అర్హులున్నా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు పొందలేదన్నారు. నరసరావుపేట డివిజన్లో 6,416 ఎల్పీఎంలు, యడ్లపాడు మండలంలో 1872 జాయింట్ ఎల్పీఎంలు ఉన్నాయన్నారు. రూ.50 రుసుంతో రైతులు వెంటనే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఈనెల 30 లోపు సబ్ డివిజన్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

అదానీ స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

కొల్లిపరలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లిపర

ఇంటికి అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించటానికి వస్తే అడ్డుకోవాలని సిపిఎం తెనాలి రూరల్ కార్యదర్శి ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. గురువారం కొల్లిపర మున్నంగి వల్లభాపురం గ్రామాల్లో పర్యటించి స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని అడ్డుకోవాలని కరపత్రాలను పంచి ప్రజలతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ భారాన్ని

తగ్గిస్తామని ఒక్క రూపాయి కూడా కరెంటు చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చి 9 నెలలోనే రూ.15 వేల 485 కోట్లు ప్రజలపై విద్యుల్ భారం సర్దుబాటు చార్జీల రూపంలో వేసిందని ఆయన అన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని చెప్పిన మంత్రి నారాలోకేష్, టిడిపి నాయకులు ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించటానికి ఆదేశాలు ఇవ్వటం దుర్మార్గం అన్నారు. రైతులు పంపుసెట్లకు మీటర్లు బిగించటానికి ప్రయత్నిస్తే రైతులు ఎదురు తిరిగడంతో రైతులకు మీటర్లు ఆపారన్నారు. ప్రస్తుతం మీటర్లు గృహాలకుబిగించడానికి వస్తే అడ్డుకోవాలని ఆయన కోరారు. ఈ మీటర్లకు జవాబు దారితనం, గాని పారదర్శకత కానీ ఉండదన్నారు. కావున ప్రజలందరూ కలిసికట్టుగా మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.

డయేరియా నుండి పిల్లల్ని కాపాడాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

డయేరియా వలన పిల్లల మరణాలు సంభవిం చకుండా వైద్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక అధికారి ఏ శ్రావణ బాబు వైద్యశాఖ వారికి తెలిపారు. దుగ్గిరాల, ఈమనీ పెదవడ్లపూడి ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వారికి గురువారం దుగ్గిరాల పి.హెచ్.సి లో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన జీరో నుండి ఐదు సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు ఎక్కువగా డయేరియా బారిన పడుతుంటారని వారిలో మరణాలు సంభవించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లల తల్లితండ్రులకు కూడా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని కోరారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పై వైద్య సిబ్బంది తో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో దుగ్గిరాల పిహెచ్సి వైద్యాధికారి ఇజాస్ అబ్దుల్ రెహమాన్ సిబ్బంది సునీత స్వరూప రాణి వి సుబ్బారావు తదితరులుపాల్గొన్నారు.

చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక లెక్చరర్స్ కాలనీలోని వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జగన్ పాలలో ప్రజలకు అందిన సంక్షేమాలు, చంద్రబాబు నేతత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజలు మోసపోతున్న విధానాలను పుస్తకములో పొందుపరచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దేశు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దుబాయి బాబు, యాతాటి అనిల్, నాయకులు బూరెల దుర్గ, చింక సురేష్ బాబు, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మంగళగిరి షేక్ సలీం ఆఫీస్ లోగురువారం నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ యువతకు ఆదర్శమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రాహుల్ గాంధీ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఏపీ వివర్స్ చైర్మన్ రామనాథం పూర్ణచంద్రరావు, గుంటూరు జిల్లా కాపు సాధికారక చైర్మన్ రెమిడి శెట్టి హనుమం తరావు, మంగళగిరి మహిళా అధ్యక్షురాలు షేక్ మున్ని, మంగళగిరి మండల, తాడేపల్లి పట్టణ అధ్య క్షులు పుప్పాల చౌదరి, దర్శనపు శామ్యూల్, తాడేపల్లి మండల అధ్యక్షులు షేక్ సుభాని, మంగళగిరి మండల ఉపా ధ్యక్షులు గండి కోట వెంకయ్య, సీనియర్ నాయకులు ఆర్ల వెంకట స్వామి పాల్గొన్నారు.

ఎంటిఎంసి పరిధిలో 265 యోగా కేంద్రాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

యోగాంధ్ర లో ఎం టి ఎం సి పరిధిలో 265 యోగ కేంద్రాలను గుర్తించినట్లు ఎం టి ఎం సి కమిషనర్ ఎస్ కే ఆలిం బాషా తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని శశివాలయాల పరిధిలో ఉన్న వారిని యోగాలో భాగమయ్యే విధంగా చూడాలని కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు పెద్ద ఎత్తున యోగా కేంద్రాల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో మన రాష్ట్రం స్థానం సంపాదించే విధంగా కషి చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, బ్యూటీ కమిషనర్ శ్రీకాంత్, సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్ కుమార్, వి విధ విభాగాల సిబ్బంది, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి యోగాలో ఫోటోగ్రఫీ ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ప్లానింగ్ సెక్రటరీ జై కిరణకుమార్ మరియు జయలక్ష్మి లకు అవార్డు చేయడంతో పాటు శాలువా తో సన్మానించారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో యోగాలో శ్రీమతి జయలక్ష్మి గారు ఫోటోగ్రఫీలో నగరపాలక సంస్థ ప్లానింగ్ సెక్రటరీ జె కిరణ్ కుమార్ ఉత్తమ ప్రదర్శన గాను అవార్డులు తీసుకున్నారు వారికి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాష గారు సన్మానం చేశారు.

ప్రజాశక్తి తెనాలి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగానున్న గాంధీ రోడ్, పుర వేదిక ప్రాంత ంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి కమిషనర్ వి లక్ష్మీపతి గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన ఉదయం 6 గంటల నుంచి 8:30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిధు లుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలి పారు.

ఘనజీవామృతంతో భూమిని కాపాడండి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఘనజీవామృతం భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రకృతి వ్యవసాయ పల్నాడు జిల్లా జిల్లా అధికారి కె.అమలకుమారి సూచించారు. మండలంలోని మాదల గ్రామంలో డిసి చైర్మన్ గోగినేని కోటేశ్వరరావు గోశాలను ఆమె గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేసే ముందుగా పొలంలో రసాయనిక ఎరువులను వీడి ఘనజీవామృతం ఒక ఎకరానికి 500 కేజీలు చల్లితే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ గోశాలలో 400 ఆవుల పేడ, మూత్రంతో రైతులకు అవసరమైన 300 టన్నుల ఘనజీవామృతం, పంచగవ్య తయారు చేస్తున్నారని, కషాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కావాల్సిన వారు గోగినేని కోటేశ్వరావును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజన్ ఎమ్‌టి మధుబాబు, సౌజన్య పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మద్యం మత్తులో బావ బావమరుదులు మద్య జరిగిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో గురువారం రాత్రి జరిగింది.ఈ ఘటనలో గ్రామానికి చెందిన మోడీ రమేష్, మోడీ బిక్షాలు, పోటాబత్తిన లూకయ్య లు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనం ద్వారా క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బిక్షాలు లూకయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌల్దార్ల కుటుంబాలకు జనసేన పరామర్శ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నాదెండ్లకు చెందిన ఎన్.ఆదినారాయణ, తూబాడుకు చెందిన గోపాలరావు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్ అన్నారు. మృతుల కుటుంబాలను వారు గురువారం పరామర్శిం చారు. ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, మునీర్ హసన్, శరత్, రామారావు, సాంబ, హర్షవర్ధన్, జగదీష్, రమణయ్య, యోబు, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా గోరేబాబు

ప్రజాశక్తి- తాడేపల్లి

వైసిపి రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లికి చెందిన ఎండి గోరేబాబు నియమితు లయ్యారు. తనకు ఈ బాధ్యత రావడానికి ఎంటిఎంసి వైసీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కి అభినందనలు తెలిపారు. గురువారం బైపాస్ రోడ్ లోని వేమారెడ్డి కార్యాల యంలో ఆయన కలిసి శాలువా తో సత్కరించారు.



NAME CHANGE

I G.NARAYANA REDDY, S/o DHANUNJAYA, Rayadurg, Anantapur, A.P, Now working as a SI of police in Guntur Range,AP. have changed my name from **G.NARAYANA REDDY** to **G.NARAYANA.** Same as intimated to general public.

గుంటూరు నగరపాలక సంస్థ

"ఇ" ప్రొక్యూర్మెంటు టెండరు ప్రకటన

ఇ.టి. నెం 19 /2025-26 **తేది. 18-06-2025**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "ఇ" ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్ పద్ధతిన రిజిష్టరు కాంట్రాక్టుదారుల నుండి టెండర్ కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.apeprocurement.gov.in (procurement platform) వద్ద చూడవచ్చును.

"ఇ" ప్రొక్యూర్మెంట్ టెండర్ ఇ.టి. నెం.15, 18, 19 /2025-26

మొత్తం పనుల సంఖ్య	- 07
అంచనాలు మొత్తం	- 6,32,00,000/-
పని వివరములు	- రోడ్లు, కాలువలు, పైపులైన్లు మరియు ఇతర పనులు
టెండరు బిడ్లు కనపడు తేది	- 19-06-2025 ఉ॥ 10:30 గం॥లకు
టెండరు బిడ్లను వేయుటకు ఆఖరు తేది	- 04-07-2025 సా॥ 3:00 గం॥లకు
టెండరు బిడ్లను తెరచు తేది	- 04-07-2025 సా॥ 3.30 గం॥లకు

సం॥ సూపరింటెండింగ్ ఇంజనీర్,
నగరపాలక సంస్థ గుంటూరు

మహిళ ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి - మాచర్ల

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన, మాచర్ల పట్టణంలోని 23వ వార్డులో గురువారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో కాళంగి సుజాత అనే వివాహిత నైటీకి నిప్పు పెట్టుకుని కాల్చుకున్నది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో, గురువారం ఉదయాన్నే సుజాత భర్త రెస్టారెంట్ కి పనికి వెళ్లిన తర్వాత, సుజాత తనంతట తానుగా నైటీకి నిప్పు పెట్టుకొని కాల్చుకొని కేకలు వేయడంతో, పక్కింటి వారు హుటా హుటిన సుజాతను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకుతరలించారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన వైద్యం కోసం నరస రావుపేటకు తరలించారు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్ట్ ఆఫీసులో రెండు బైక్‌లు చోరీ

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల పట్టణంలోని ఫారెస్ట్ ఆఫీస్ నందు రెండు బైక్‌లు చోరీకి గురైనాయి. ఫారెస్ట్ క్వార్టర్స్ లో పాత కేసులో ఉన్నటువంటి ప్రాపర్టీని వెరిఫై చేయగా కేసులోని రెండు మోటార్ సైకిల్ దొంగలించబడిన విషయాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. 7866 పల్సర్ బైక్, 1512 హోండా షైన్ బైక్‌లు దొంగలించబడ్డాయి. ఈ మేరకు ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాజేష్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - రెంటచింతల : కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన తుమ్మరకోట లో గురువారం జరిగినది. ఎస్ఐ సిహెచ్. నాగార్జున తెలిపిన వివరాలు పేరు పోగు సైదులు (33) సాగరిక భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం రెండు సంవత్సరాల నుండి విడివిడిగా ఉంటున్నారు ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది సైదులు ఆత్మహత్య చేసుకున్నాడు తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దావా సమను

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 404/2023

Between :

1. గంగినేని కార్తీక్ తండ్రి శ్రీను
2. గంగినేని భవ్యశ్రీ తండ్రి శ్రీను

1,2 వాదులు మైనర్లు అయినందున రిప్రజెంటెడ్ బై వారు యొక్క నెక్స్ ఫ్రెండ్ మెటర్నల్ గ్రాండ్ మదర్ కూనంనేని వెంకటరత్నం మరియు ఇరువురు

.... వాదులు

Vs

గంగినేని శ్రీను మరియు ముగ్గురు.... ప్రతివాదులు

To

1.గంగినేని శ్రీను తండ్రి యోగయ్య సాఫ్ట్ వేర్ ఉద్యోగి, R/o కమ్మవారిపాలెం గ్రామం పోస్ట్, నూజెండ్ల మండలం, పలనాడు జిల్లా, వినుకొండ డిఎంసి **(1వ ప్రతివాది)**

పై నంబరు దావాను వాదులు దావా పరిహారముల పొందు నిమిత్తం దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో 1వ ప్రతివాది అయిన మీరు ఇందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయు వలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 11-07-2025 వ తేది ఉదయం 10.30 ని:లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి

తేది : 19-06-2025 ఇట్లు

పంచాగ్నుల ఉదయభాస్కర్
వాదుల తరఫు అద్వకేట్,
అద్దంకి, బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంలో న్యాయవాదులే కీలకం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాజీ పడదగిన కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు చొరవ చూపాలని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. వచ్చేనెల 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లపై సత్తెనపల్లి పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలంటే న్యాయవాదుల పాత్ర కీలకమని చెప్పారు. సమావేశంలో ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జె.సుజన్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాములో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో భద్రపరిచిన ఇవిఎంలను రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడారు. భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. సెక్యూరిటీ లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. తహాశీల్దార్ కె.వేణుగోపాలరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఐటిఐలలో మిగిలిన సీట్లకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో మిగిలిన సీట్లకు రెండవ విడత అడ్మిషన్లు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, మాచర్ల ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ పి.పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఓఅ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో వచ్చేనెల 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు వచ్చేనెల 17వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోపు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి ధ్రువీకరించుకోవాలని, 22న మాచర్ల పిడబ్ల్యూడీ కాలనీ ప్రభుత్వ ఐటిఐ నందు, 23-25 తేదీలలో ప్రైవేటు ఐటీఐలలో కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు.

మైదవోలులో నేడు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మైదవోలులో గోదామును పరిశీలిస్తున్న అధికారులు

- నాణ్యమైన సరుకు క్వింటాళ్ రూ.12 వేలు, నాణ్యత తక్కువుంటే రూ.6 వేలు
- గ్రేడింగ్ చేసి తేకుంటే ధర తగ్గిస్తాం
- తేమశాతం 20 ఉండాలి, చౌడు భూముల్లో పండిన పొగాకును కొనం
- మార్క్‌ఫెడ్ డిఎం నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పొగాకు సాగు చేసిన రైతుల నుండి చివరి కాడ వరకు కొనుగోలు చేస్తామని, రైతులెవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, మార్క్‌ఫెడ్ డిఎం టి.నరసింహారెడ్డి అన్నారు. హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోలుపై నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల తహాశీల్దార్‌లు, వ్యవసాయ శాఖ అధికారులతో నరసరావుపేటలోని మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో గురువారం సమీక్షించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 2522 మంది రైతులు ఏపిఏఎంఐఎస్ యాప్‌లో పేర్లను నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు కూడా త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల పొగాకును ప్రభుత్వం ఏపి మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఆర్‌డిఒ కె.మధులత మాట్లాడుతూ పొగాకు కొనుగోలుపై గ్రామ స్థాయిలో రైతులకు భరోసా కల్పించాలని విఆర్‌ఒ, వ్యవసాయ శాఖ సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. టి.నరసింహారెడ్డి మాట్లాడుతూ యడ్లపాడు వద్ద కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభిస్తామని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు కొనుగోలు తేదీ, సమయం ఫోన్‌కు సందేశం వస్తుందని తెలిపారు. సూచించిన రోజు కొనుగోలు కేంద్రానికి పొగాకు తీసుకురావాలన్నారు. అత్యంత మన్నిక గల రకం క్వింటాళ్ రూ 12 వేలు, నాణ్యత తక్కువ గల పొగాకు రూ.6 వేలకు కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు అనంతరం నగదు రైతు బ్యాంక్ ఖాతాకు జమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిడిఎ శివకుమారి, ఎడిఎ పి.మస్తానమ్మ, కొనుగోలు అధికారి మురళి, జిడిసిఎంఎస్ మేనేజర్ హరగోపాల్, నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని తహాశీల్దార్లు, వ్యవసాయ శాఖాధికార్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మైదవోలులో గోదాముల పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని మైదవోలులోని సుగంధ ద్రవ్యాల పార్కులో శుక్రవారం నుంచి జిల్లా స్థాయిలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు జిల్లా మార్క్‌ఫెడ్ డిఎం టి.నరసింహారెడ్డి తెలిపారు. పార్కులోని గోడౌన్లను గురువారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల్లో యాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతుల పొగాను షెడ్యూల్ ప్రకారం కొంటామని, తేమ 20 శాతం లోపు, బేల్ బరువు 25 కిలో నుంచి 150 కిలోల లోపు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. రవాణా ఖర్చులు రైతులే భరించాలన్నారు. నాణ్యమైన పొగాకు ధర కేజీ 120, తక్కువ నాణ్యత పొగాకు ధర రూ.60 నిర్ణయించినట్లు తెలిపారు. గ్రేడింగ్ చేసుకుని తేవాలని, లేకుంటే తక్కువ ధరను వేస్తామని అన్నారు. చవుడు భూముల్లో పండించిన పొగాకులో నికోటిన్ లేనందున కొనుగోలు చేయబోమన్నారు. ముందుగా తిమ్మాపురంలోని జీసీఐ కంపెనీ ఫ్లాట్‌ఫామ్‌ను పరిశీలించారు. జిల్లా పొగాకు కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జి బి.మురళీకిషోర్, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డిడిఎ శివకుమారి, ఎడిఎ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

గైర్హాజరయ్యే అధికారులపై ఫిర్యాదు చేస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మాట్లాడుతున్న ఎంపిపి మీరయ్య

ప్రజాప్రతినిధులంటే అధికారులకు అలుసా? అని ఎంపిపి బి.మీరయ్య ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఎంపిపి మాట్లాడుతూ సమావేశాలకు అధికారులు రాకుంటే సమస్యలను ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి హాజరు కాకపోతే రోజువారి కార్యక్రమాల్లో ఎంత నిబద్ధతగా పనిచేస్తున్నారో అర్థమవుతోందన్నారు. గైర్హాజరయ్యేవారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పెదకూరపాడు సర్పంచి రాజు, బలుసుపాడు ఎంపిటిసి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ కోతలపై స్పష్టతివ్వాలని కోరారు. వీధిలైట్లు పగలే వెలుగుతున్నాయని చెప్పారు. పెదకూరపాడులో అంబేద్కర్ బొమ్మ నుండి పంచాయితీ వరకు ఉన్న విద్యుత్ స్తంభాలను ఎత్తు పెంచాలని కోరారు. చెయ్యి ఎత్తితే తీగలు అందే ప్రాంతాల్లో సత్వరం పనులు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు వేగం పెంచాలని, పెదకూరపాడు ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్ను ఏర్పాటు చేయాలని కోరారు. తహశీల్దార్ ధనలక్ష్మి మాట్లాడుతూ భూ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శరత్‌బాబు చెప్పారు.

సమస్యల పరిష్కారం, హక్కుల రక్షణ కోసం సమ్మె

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మాట్లాడుతున్న డి.శివకుమారి

సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం వచ్చేనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ పల్నాడు జిల్లా కన్వీనర్ డి.శివకుమారి కోరారు. ఈ మేరకు స్థానిక కన్నెగంటి హనుమంతు భవనంలో సిఐటియు నాయకులు కె.సాగర్‌బాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో శివకుమారి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పాలనలో కార్మికుల శ్రమను కొల్లగొట్టి కార్పొరేటర్లకు దోచిపెట్టే విధానాలను అవలంబిస్తోందని చెప్పారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు అమలుకు హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ఉన్న ఉద్యోగాలకి ఎసరు పెడుతోందన్నారు. స్కీమ్ వర్కర్లు, ఇతర చిరుద్యోగులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, డి.కొండలు, మల్లేశ్వరి, రమణ, సీమోను, బి.కొండలు, జె.నరసింహ నాయక్, రమేష్ పాల్గొన్నారు.

గిరిజనుల్లోనే అధికంగా సెకిల్‌సెల్ ఎనీమియా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అరుదైన, జన్యుపరమైన వ్యాధి సికిల్ సెల్ ఎనీమియాను రూపుమాపేందుకు కృషి చేద్దామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. దీనిపై నరసరావుపేట మండలం పెద్దతురకపాలెం గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహ పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరవగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ కొద్ది మందికో వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వస్తుందని, బాధితులను వెంటనే గుర్తిస్తే వారిని కాపాడొచ్చని చెప్పారు. సికిల్ సెల్ ఎనీమియా వంశపారపర్యంగా రక్తంలో ఆక్సిజన్ తక్కువై తెల్ల రక్త కణాల శాతం పడి పోతుందన్నారు. ఈ వ్యాధిపై గిరిజనుల్లో ఎక్కువ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉందని, మేనరికాలు, ఒకే రక్తం కలిగిన వారిని వివాహం చేసుకోవడం వల్ల ప్రధానంగా ఈ వ్యాధి సోకుతుందని చెప్పారు. రక్త హీనత, సరిపడ ఆక్సిజన్ అందకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జోత్స్న, ఆర్‌డిఒ కె.మధులత, తహాశీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 100కి తగ్గకుండా అడ్మిషన్లు జరగాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ మాట్లాడుతూ నెమ్మదిగా నేర్చుకునే పిల్లలపై, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠాలను ఓపిగ్గా బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈ నెల నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రమైన మినరల్ వాటర్ సరఫరా చేస్తుండటంపై అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డిఈఓ ఎల్.చంద్రకళ పాల్గొన్నారు.

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్.. విద్యార్థిని పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తాగునీటి కాల్వల్లో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎంటిఎంసి పరిసర ప్రాంతాల సెప్టిక్ ట్యాంక్ వాహనదారులు తమ ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చిన సెప్టిక్ ట్యాంక్ మలమూత్ర విసర్జలను పట్టణంలోని మాతా శివ చైతన్య ఆశ్రమం సమీపంలో గుంటూరు, తెనాలి పట్టణాలకు మంచినీరు అందించే కాలువల్లో కలుపు తున్నారు. చెరువులు పంట పొలాలలో కూడా కొన్నిచోట్ల మలమూత్ర మలినాలను వదులు తున్నారని పర్యావరణ ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మంగళగిరి హైవే పక్కన ఒక చెరువులో మలమూత్ర మలినాలను వదులుతున్నారన్న సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు వెంటనే స్పందించి సెప్టిక్ ట్యాంక్ వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించి వేశారు. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరికలు జారీ చేశారు. మళ్లీ ఇప్పుడు తాజాగా గురువారం తాడేపల్లి పట్ట ణంలో నీ కృష్ణనగర్ నులకపేట ఏరియాలో సెప్టిక్ వాహనాలు ప్రత్యక్షమ వుతున్నాయి. ఏకంగా పంట కాలాలతో పాటు, ముఖ్యమైన మూడు పట్టణాలు మంచినీరు అందించే కాలువల్లో కూడా ఈ వ్యర్థాలను వదిలేస్తున్నారు. మాతాజీ ఆశ్రమం పక్కన ఉన్న మట్టి రోడ్డు నుండి సెప్టిక్ ట్యాంక్‌తో ములినాలను తీసుకువచ్చి పంట కాలువలో వదులుతున్నారు.

గమనించిన మీడియా ప్రతినిధులు ఇదేమిటిని ప్రశ్నిస్తే అరకొర సమాధానం చెప్పి అక్కడ నుంచి జారుకున్నారు. పంట కాలవనీరుని కలుషితం చేయటం వలన. ఆ నీరు ఫిల్టర్ బెడ్ పాయింట్‌కు చేరుకొని ప్రజలకు మున్సిపాలిటీ అధికారులు అందిస్తున్నా డ్రింకింగ్ వాటర్ కలుషితం అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల డయేరియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి కృష్ణ నగర్ నులకపేట గ్రామస్తులు రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు అని వాపో తున్నారు. మున్సిపల్ కమిషనర్ మరియు అధికారులు వెంటనే స్పందించి, పంట కాలవలు, మరియు గుంటూరు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి పట్టణంలో కొంత భాగం ప్రజలకు మంచినీరు అందించే కాలువలతో పాటు ఫిల్టర్ బెడ్‌లో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు కలవకుండా చూడాలని స్థానికుల కోరుతున్నారు. సంబంధిత సెప్టిక్ ట్యాంక్ యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేఎల్‌యు హాస్టల్ భవనాల నుండి వస్తున్న

మురుగునీరును అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామ పరిధిలో ఉన్న కే ఎల్ యు హాస్టల్ భవనాల నుండి వస్తున్న వ్యర్థమైన మురుగునీరును అరికట్టాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. వందలాది మంది విద్యార్థులు నివాసం ఉంటున్న భవనాలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా నిర్మించుకోకపోవడం తో నిర్వహకులు గ్రామాలకు

వ్యర్థమైన మురుగునీరు రోడ్డుపైకి పొంగుతున్న దశ్యం

రాకపోకలు సాగించే, రహదారిపై బాహాటంగా మురుగు నీరు వదలడంతో గ్రామ ప్రజలు, వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యర్థపు నీరు రోడ్డుపైకి రావడం వలన దుర్గంధం వెదజల్లి దోమలు ప్రబలటమే కాక, ఆ ప్రాంతంలో ప్రజలు జబ్బులు బారిన పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కేఎల్ యు యాజమాన్యం డ్రైనేజీ వ్యవస్థను నిర్మించుకొని, వ్యర్థమైన మురుగునీరును బయటకు వదలకుండా, ప్రజలకు అసౌ కర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.

కాట్రగడ్డ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కాజా గ్రామంలో సిపిఎం అభివృద్ధికి కడదాకా కృషి చేసిన కాట్రగడ్డ వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కాజా గ్రామంలో సిపిఎం నేత కాట్రగడ్డ వెంకటేశ్వర్లు సంస్మరణ సభ సిపిఎం జిల్లా నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభలో సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్ లాల్ మాట్లాడుతూ కమ్యూనిస్టు నేతలు వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి ప్రజా ప్రయోజనార్థం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారనీ, చేస్తారని చెప్పారు. కాట్రగడ్డ వెంకటేశ్వర్లు స్ఫూర్తితో గ్రామంలో పార్టీ నిర్మాణానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కాట్రగడ్డ వెంకటేశ్వర్లు తన పని చేసుకుంటూనే వివిధ సంఘాలలో సభ్యులుగా చేరి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, అదే స్ఫూర్తి తో రైతుల కు గిట్టుబాటు ధర కల్పించే విధానంలో, దోపిడి దారుల విధానాలను తిప్పికొట్టడం లో ఆయన ఆశయ స్ఫూర్తి తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ఉగ్రవాదులు ఎలా వచ్చారూ... ఎలా వెళ్ళి పోయారు... వారు ఎక్కడ ఉన్నారో ఎవరికి తెలియదన్నారు. ఆపరేషన్ సింధూర్ లక్ష్యాలు ఏమి సాధించారో చెప్పాలని అన్నారు. యుద్ధం ఎందుకు ఆగిందో కేంద్రం దేశ ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజల మధ్య మతాల అనైక్యత కోసం కాకుండా అందరూ ఐక్యంగా ఉండేలా కషి జరగాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జేవీ రాఘవులు మాట్లాడుతూ వ్యక్తులు చనిపోయిన తర్వాత కొందరినే సమాజం గుర్తు పెట్టుకుంటుందనీ,. ప్రజల కోసం నిలిచిన వారే అలా ప్రజల్లో నిలిచి ఉంటారని చెప్పారు. అటువంటి వారిలో కాట్రగడ్డ వెంకటేశ్వర్లు ఒకరన్నారు. ప్రపంచం ఎటు పోయినా ప్రపంచం లో యుద్ధం జరుగుతున్నా మేము మాత్రం విశాఖ లో యోగ నిర్వహిస్తాం... మోడీ మెప్పు పొందుతాం అని రాష్ట్ర నేతలు చెబుతున్నారనీ... ఎద్దేవా చేశారు. ప్రపంచంలో యుద్ధ వాతావరణం సృష్టించి ఆయుధ వ్యాపారాన్ని అమెరికా సామ్రాజ్యవాదులు చేయాలని యుద్ధం సష్టిస్తున్నారన్నారు. అధికారం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమెరికా కు అనుకూలం గా వ్యవహరిస్తుందనీ తెలిపారు. ప్రపంచం లో యుద్ధ వాతావరణం నెలకొని ఉంటే మనం మాత్రం యోగ నిర్వహించుకుందాం అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి అంటూ పేర్కొన్నారు. ప్రజలను పాలించడం మాని ప్రతిపక్ష పార్టీలు ను ఎలా నాశనం చేయాలో అలా పాలన చేస్తున్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం ఎవరి కోసం ప్రజల కోసమా.. మీ కోసమా అని ప్రశ్నించారు. రాజధాని లో గల 33వేల భూములు పంచేశారు. మరల భూమి కావాలని 44వేల ఎకరాలు భూమి కావాలంటే ప్రజలు ఎలా నమ్మాలి అని ప్రశ్నించారు. ఇది ప్రజల ఆస్తుల తో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంది తప్ప మరొకటి కాదని చెప్పారు. పెట్టుబడిదారులకు ఖనిజ సంపద గల అడవుల మొత్తాన్ని కార్పొరేట్ వారికి అప్పగించడం మే ఇప్పుడు జరుగుతున్న ఎన్కౌంటర్ లని చెప్పారు. రాబోతున్న పరిణామాలను అర్థం చేసుకుని చైతన్య వంతులను చేసి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలను నిర్వహించాలని అదే కాట్రగడ్డ కు ఇచ్చే నివాళులు అని తెలిపారు. అక్కడెక్కడో యుద్ధం జరుగుతుంటే మనకేమి అనుకుంటే పొరపాటు ఇరాన్ నుంచి మనం ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం. నేడు అది పెను సమస్యగా మనకు ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. ఈ క్రమంలో ఐక్యంగా ఇటువంటి విధానాలను ఎదుర్కొనేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. కొలనుకొండ మాజీ సర్పంచ్ కాట్రగడ్డ శివరామకృష్ణయ్య మాట్లాడుతూ కాట్రగడ్డ వెంకటేశ్వర్లుతో గల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. సిపిఎం విశిష్టత వలనే అనేక మంది పార్టీ లో కొనసాగుతూ వచ్చారని చెప్పారు. తోటి సహచరులు తాడిబోయిన శివన్నారాయణ, పూల మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆయన తో గల అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈదా ప్రతాపరెడ్డి, తమ్మా ప్రసాదరెడ్డి, మారెళ్లా అంజిరెడ్డి, నాగార్జున, బి. పుల్లారావు, బి. కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవి రాఘవులు

మాట్లాడుతున్న ఎస్ఎస్ చెంగయ్య

మాట్లాడుతున్న జవహర్‌లాల్

198వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశ క్తి - తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావలసిన బకాయిల కోసం ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 198వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో ఉదయగిరి. రమణ, మల్లెశివకుమారి, ఉప్పు కాసమ్మ, ఈసారమ్మ, లక్ష్మి లు కూర్చు న్నారు. దీక్షలను బి సూర్యప్రకాశరావు, దామవరపు నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ న్యాయ సమ్మతమైన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షైక్ సుభాని, షేక్ బాషా, షైక్ అసిఫ్ ఎంగురవయ్య, దర్శి మాణిక్యరావు, తుపాకుల నాగేశ్వరరావు, కె.హగ్గయ్య, మహిళలు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యల పై సంబంధిత అధికారులకు చరవాణి నుండి ఆదేశించి, సమస్యను వెంటనే పరిశ్కరించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ప్రజలకు,పార్టీ శ్రేణులకు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష, అని ఇప్పటికే తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న కుమ్మర క్రాంతికుమార్

బిసి హాస్టల్‌ను సందర్శించిన నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని రాజాగారి తోట, బిసి బాలికల హాస్టల్‌ను బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ సందర్శించారు. హాస్టల్లోని గదులను, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి హాస్టల్ నిర్వహణ గురించి, మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా.. లేదా, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో విద్యార్థులకు పడుకునే బెడ్స్, వాష్ రూమ్స్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ ఛార్జీలు పెంచాలని నాయకులు కోరారు. బీసీ హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందిచాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను కల్పించడంతో పాటు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతురావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

పేదలకు సిఎం సహాయనిధి వరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సీఎం సహాయ నిధి నిరుపేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువార నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 15 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన వద్దకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన డబ్బులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు, కూటమి ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



రవీంద్రారెడ్డిని కలిసిన రొంపిచర్ల నాయకులు

వైసిపి పంచాయతీ రాజ్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రొంపిచర్ల నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసీపీ పంచాయితీ రాజ్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని రొంపిచర్ల మండల నాయకులు తాడేపల్లిలో గురువారం కలిశారు. పంచాయితీ రాజ్ రాష్ట్ర సెక్రటరీ పడాల చక్రారెడ్డి, నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు పొనుగోటి వెంకట్రావు, అప్పిరెడ్డి, గెల్లి మల్లికార్జున రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఇరిగేష్ ఈఈ రమేష్

పనులను సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రెంటచింతల

సాగునీటి కాలువలకి చేపట్టిన మరమతు పనులు నాణ్యత ఉండాలని, అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసి అన్నదాతలకు సాగునీటి సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని ఇరిగేషన్ ఈఈ టి.రమేష్ ఆదేశించారు. గురువారం రెంటచింతల మేజర్ దశ బంధువ కాలువ పనులను పరిశీలించారు 7.6 కిలోమీటర్ల నుండి 15.6 కిలోమీటర్ల వరకు చేపట్టిన పనులను 36.70 లక్షలు కేటాయించారని తెలిపారు ఈ మేజర్ కింద అధికారికంగా 4384 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు మాచర్లనియోజక వర్గానికి సాగునీటి కాలువల మరుమతులకు రెండు కోట్లు కేటాయించగా అందులో రెంటచింతల మండలంలో ఒక కోటి 33 లక్షల కేటాయించారని తెలిపారు ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ పొట్ల నరసింహారావు, డిఈ మురళీధర్, ఏఈ సుధాకర్, సాగునీటి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు10 వేల మందితో పరేడ్ గ్రౌండ్‌లో యోగా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈనెల 21వ తేదీన 10 వేల మందితో పరేడ్ గ్రౌండ్‌లో యోగ నిర్వహిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర౾ పి.అరుణ్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ పి.అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం నరసరావుపేటలో 10 వేల మందితో, అమరావతి ధ్యాన బుద్ధుడి విగ్రహం వద్ద మరో 10 వేల మంది, జిల్లాలోని 5 వేల వేదికల వద్ద మొత్తం జిల్లా వ్యాప్తంగా

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఘనంగా అంతర్జాతీయ యెగ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. యోగా దినోత్సవ సన్నద్ధత, జిల్లాలో ఏర్పాట్లు, యోగా ట్రైనర్స్‌కు, యోగా కార్యక్రమంలో పాల్గన్న వారికి ప్రశంసా పత్రాలు పంపిణీ, ఫేజ్-3 యోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయడం వంటి అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక ప్రజాప్రతి నిధులు, పాఠశాల విద్యార్థులు, సాధారణ ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు యోగాంధ్ర కార్యక్రమానికి 9.81లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నారన్నారని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, ఆర్డీఓ కె.మధులత తదితరులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే ప్రజలే తరిమికొడతారు : చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

జగన్ రెడ్డి, వైకాపా తీరుమారకపోతే ప్రజలే వారిని తరిమికొట్టే రోజులు త్వరలోనే వస్తాయని హెచ్చరించారు అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం, చట్టాల్ని గౌరవిస్తున్నామని, జగన్‌లా ఇళ్లకు తాళాలు వేసి ఎవర్ని నిర్భంధించడం లేదన్నారు. వారి హయంలో రాజా రెడ్డి రాజ్యాంగం నడిచింది కాబట్టే పల్నాడు జిల్లా ఆత్మకూరులో దళితులను గ్రామం నుంచి బయటకు తరిమేయడమే గాక, పరామర్శించడానికి వెళ్లకుండా చంద్రబాబును అడ్డుకున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి శవరాజకీయాలు, కులాలు, మతాలు మధ్య చిచ్చుపెట్టే

మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

కుయుక్తుల్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నాయకత్వంలో భీమిలి నియోజకవర్గం నుంచి సుమారు 70వేలమంది యోగాంధ్రలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ పర్సన్ ఇన్ ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

అసాంఘిక శక్తులను, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించే వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్యకర్త రెంటపాళ్ల గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు చనిపోయిన సంవత్సరం తరువాత పరామర్శించి నిబంధనలను ఉల్లంఘించారన్నారు. జగన్‌కు ఓటేయ నందుకు ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ధ్యేయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనలో పూర్తిగా విఫలమైందని, అలాగే వైసీపీ జగన్మోహన్ క్రిమినల్ ఆలోచనతో వస్తున్నాడన్నారు. అతని మాటలు ప్రజలు నమ్మవద్దని గంగాధర్ అన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెవెన్యూ, పిజిఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు సమస్యలు త్వరగా పరిష్కరించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ ఆదేశించారు. గురువారం రొంపిచర్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదులు, సమస్యలు సకాలంలో పరిష్కరించాలని తహశీల్దార్ బండి నిర్మలాకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదు దారులతో కలిసి మాట్లాడారు. మండలంలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కార మార్గం మండల స్థాయిలోనే చూపాలని తహశీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.నిర్మల, ఆర్ఐ కోటేశ్వరరావు, విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మొక్క నాటుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని వచ్చని పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లగడపాడు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, ఫౌండేషన్ సభ్యులు మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణం మన జీవనాధారం దాని సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ప్రకృతిని కాపాడుకునేందుకు చెట్లను నాటడం, నీటిని పొదుపుగా వాడుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం చేయాలన్నారు. వాల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, పంచాయితీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుక రాహుల్‌గాంధీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

అణగారిని వర్గాల గొంతుక రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు మాచర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పేదలకు స్వీట్లు పంచిపెట్టారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్రం కులగణనపై చట్టానికి అంగీకారం తెలపటం వెనుక రాహుల్‌గాంధీ మూడేళ్లుగా చేసిన అలుపెరగని పోరాట ఫలితమే అని కొనియాడారు. 2029లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని దానికి రాహుల్ గాంధీ పోరాటమే కారణం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, కారంపూడి మండల పార్టీ అధ్యక్షులు కొమ్ము కోటేశ్వరరావు, గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, దొడ్డా శ్రీనివాసరావు, గాలం పెద్ద అంజి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాచర్లలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాహుల్ గాంధీ జన్మదినవేడుకలు చిలకలూరిపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎం.రాధాకృష్ణ, నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు.నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాధాకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో లౌకికవాదాన్ని కాపాడగలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కొన్ని వందల కోట్ల రూపాయల డబ్బు, వందల ఎకరాల భూములు అత్యంత విలువైన విశాలమైన భవనాలు స్వతంత్ర భారతదేశానికి దానంగా ఇచ్చిన గాంధీ నెహ్రూ కుటుంబ వారసుడైన రాహుల్ గాంధీకి ఈ రోజు సొంత ఇట్లు కూడా లేదని, అది వారి నిజాయితీకి దర్పణమన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చుక్క విన్సెంట్ పాల్, ఇంటూరి భవాని, యాల వెంకటర బాబు, పెదలంక సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ఆశ్రమ పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలకు రోటరీ క్లబ్ సభ్యులు సౌండ్ సిస్టమ్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ మాట్లాడుతూ పాఠశాలలోని అనేక సామాజిక, జాతీయ పండుగలు, ఉత్సవాలు, పాఠశాల వార్షికోత్సవాల వంటి కార్యక్రమాలలో, మోటివేషన్ వంటి క్లాసులు అవసరాల సందర్భంలో పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. హెచ్ఎం పద్మావతి రోటరీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, ప్రెసిడెంట్ ఎలెక్ట్ తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఎలెక్ట్ ఆలేటి కోటేశ్వరరావు, పఠాన్ నాగూర్ వలి, శివపార్వతి, పాఠశాల డెవలప్‌మెంట్ చైర్మన్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

పంచాయితీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. జులై 9న జరిగే సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ మండల పరిధిలోని తక్కెళ్ళపాడు. గ్రామపంచాయతీ కార్యదర్శికి, ఉప్పలపాడు గ్రామపంచాయతీ సర్పంచి శ్రీనివాసరావుకి మరియు గ్రామపంచాయతీ అధికారికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21000 ఇవ్వాలని కోరారు. జులై 9న జరిగే సమ్మెలో పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనె, గ్లౌజులు, మాస్కులు వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు, పండుగ సెలవలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్నం భోజనం కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రాజా రమేష్, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూని యన్ ఉప్పలపాడు పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గద్దె దేవ సహా యం, పిల్లి దానియేలు, జి.బ్రహ్మం సి హెచ్. సామ్రాజ్యం, తక్కెళ్ళపాడు పంచా యతీ వర్కర్స్ యూని యన్ నాయకులు కె.శేషగిరి. ఎస్.కె సుభాష్ చంద్రబోస్, ఆర్.బోడియ్య, ఎం.నాగేశ్వరావు ఎస్.రాంబాబు, రంగా పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ

మెకానిక్ చంద్రశేఖర్ మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

చంద్రశేఖర్ (ఫైల్)

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన మెకానిక్ గుడిసె చంద్రశేఖం (60) బుధవారం మధ్యాహ్నం గుండె పోటుతో కన్నుమూశాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మెకానిక్ చంద్రశేఖర్ మంచి వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ పార్టీల నాయకులు గురువారం ఉదయం వడ్డేశ్వరం గ్రామంలోని అయన నివాసంలో బౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి గుడిసె శ్రీనివాసరావు, వైఎస్ఆర్‌సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, మండల నాయకులు కత్తిక రాఘవరావు, మున్నంగి వివేకానందరెడ్డి, గొడవర్తి శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ఇన్‌చార్జి మేక వెంకట్రామిరెడ్డి, టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూధనరావు, కుటుంబ సభ్యులు గుడిసె రాజు, గుడిసె ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా భోగి వినోద్

ప్రజాశక్తి - మంగళగిరి

భోగి వినోద్, వంగర హనుమాన్‌కుమార్

నియోజకవర్గ టిడిపి తెలుగు యువత అధ్యక్షులుగా మంగళగిరి పట్టణానికి చెందిన భోగి వినోద్‌ను గురువారం నియమించారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షులుగా వంగర హనుమాన్ కుమార్‌ను నియమించినట్లుగా టిడిపి నియోజకవర్గ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నియమించినట్లుగా తెలిపింది.

ఎన్ఆర్‌ఐలో నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో తాడికొండ నియోజకవర్గం శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఉద్యోగ మేళాకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ హాజరవుతారని తెలియజేశారు. జాబ్ మేళాకు పలు ప్రాంతాలకు చెందిన 25 ప్రముఖ కంపెనీల ద్వారా, ఉద్యోగ ఉపాధి కల్పనా కొరకు కంపెనీల ప్రతినిధులు 857 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ,యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గని సద్వినియోగం చేసుకొని ఉద్యోగం సంపాదించుకోవాలని కోరారు. ఉద్యోగ మేళాలో జిల్లా నైపుణ్యాభివఅద్ధి సంస్థ అధికారి శ్రీనివాస రావు, ఆర్డీవో రంగరాజు ,కే.ఆర్.సి గుంటూరు డిప్యూటీ కలెక్టర్, గుంటూరు జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ఇంటర్ డిగ్రీ, బిటెక్, డిప్లమో, ఫార్మసీ, పీజీ విభాగంలో విద్యను అభ్యసించిన 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

తల్లిదండ్రుల త్యాగాలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతి ఒక్క పట్టభద్రుడి విజయం వెనుక వారి తల్లిదండ్రుల త్యాగాలు ఉన్నాయని, అవి వెలకట్టలేని అని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి అన్నారు. గురువారం మండల పరిధిలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐటి, హెల్త్‌కేర్, ఆక్వా రంగాలలో అనేక అవకాశాలను కల్పిస్తుందని, స్టార్టప్ కంపెనీలను స్థాపించి ఉద్యోగ నియమకాలను అందించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. విజన్ 2047లో యువత ముఖ్య భూమికని వారివారి రంగాలలో రాణించి రాష్ట్ర దేశ ప్రగతికి తోడ్పడాలని అన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయ చాన్స్లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ ప్రపంచంలోనికి అడిగిడుతున్నారని ఎదురయ్యే సవాళ్ళను అధిగమించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉత్తమ విద్యార్థిని సన్మానిస్తున్న కె.మధుమూర్తి, విద్యాసాగర్

అనంతరం 1195 మంది విద్యార్థులకు డిగ్రీ ప్రధానం చేశారు. 11 మందికి బంగారు పతాకము ప్రశంసా పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వివిఐటి వైస్ ఛాన్సర్ కొడాలి రాంబాబు, వివిఐటి వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై మల్లికార్జున రెడ్డి, సెక్రటరి ఎస్. బదరి ప్రసాద్, జాయింట్ సెక్రటరి మామాళ్ళపల్లి శ్రీకృఅష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కారించాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

గ్రామల్లోని సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని మండల సర్వసభ్య సమావేశం తీర్మానించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ సమావేశం జరిగింది. సమావేశంలో వచ్చినటువంటి సమస్యలపై అధికారులు చేపట్టినటువంటి అంశాలను తొలుత సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సమస్యలపై దృషి సారించి పరిష్కరించాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు స్థానిక సమస్యలను ఎకరవు పెట్టారు. ప్రధానంగా సిరిపురం, పేరేచర్లచర్ల క్వారీ ప్రాంతాలలో తాగునీటి సమస్యతో ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, గత సమావేశంలో ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, సమస్య పరిష్కారం కాలేదని, ఆయా గ్రామాల ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై మండల గ్రామీణ అభివృద్ధి రక్షిత మంచినీటి పథకం అధికారి సుజాత ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు మండల శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రాజకీయ పార్టీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న, జెడ్పీటీసీ సిద్ధయ్య

ఢిల్లీకి మాజీ ప్రధానుల విగ్రహాల తరలింపు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక సూర్య శిల్పశాలలో తయారైన మాజీ ప్రధాన మంత్రులు అటల్ బీహార్ వాజ్ పేయి, పి.వి. నరసింహారావు విగ్రహాలను ఢిల్లీకి పంపనున్నామని శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ రెండు విగ్రహాలను జూన్ 28న జరగనున్న అవార్డు బహూకరణ కార్యక్రమంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్/ తెలంగాణ భవన్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో జరగనుందని కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవి చంద్ర తెలిపారు. దేశ రాజధానిలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి తాము రూపొందించిన విగ్రహాలను తరలించడం పట్ల తెనాలి శిల్పులు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

నేటితో ఈకేవైసీ గడువు పూర్తి

మోరంపూడి గ్రామంలో కౌలు రైతుకు సిసిఆర్సీ కార్డును అందజేస్తున్న ఏఓ

ప్రజాశక్తి - దుగ్గిరాల

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు ఈకేవైసీ గడువు నేటితో ముగియనుందని మండల వ్యవసాయాధికారి ఆర్ విజయబాబు తెలిపారు. మండలంలోని మోరంపూడి, రేవేంద్రపాడు గ్రామాలలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. సిసిఆర్సి కార్డుల కోసం కౌలు రైతులు వీఆర్వో లేదా విఏఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, ఏఈఓ ప్రజ్ఞన్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేటలోని డి ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు ప్రారంభించారు. శిబిరంలో వైద్య బృందం విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, జి.వెంకటరత్నం, పి.రాంబాబు, టి.మురళీకృష్ణ, కె.ఉపేంద్ర, ఆలపాటి వెంకట హరి ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

యోగాంధ్రలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులతో యోగాంధ్ర

ప్రజాశక్తి - తెనాలి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం యోగాంధ్ర 2025 కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 500 మంది యోగాంధ్ర 2025 ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక యోగాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్స్ దాసరి వీర వసంతరావు, గొడవర్తి సాయి హరే రామ్, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ వి మహాలక్ష్మిపతి, మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్స్ శ్రీమన్నారాయణ, వాణి, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్ఓ రాంప్రసాద్, మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ డీఈలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యువతకు ఆదర్శం రాహుల్ గాంధీ

ప్రజాశక్తి - మంగళగిరి

యువతకు ఆదర్శం రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఏపీ వీవర్స్ చైర్మన్ ఆర్.పూర్ణచంద్రరావు, గుంటూరు జిల్లా కాపు సాధికారక చైర్మన్ రెమిడిశెట్టి హనుమంతరావు, మంగళగిరి మహిళా అధ్యక్షురాలు షేక్ మున్ని, మంగళగిరి మండల అధ్యక్షులు పుప్పాల చౌదరి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్, తాడేపల్లి మండల అధ్యక్షులు షేక్ సుభాని, మంగళగిరి మండల ఉపాధ్యక్షులు గండికోట వెంకయ్య, సీనియర్ నాయకులు ఆర్ల వెంకట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిప్స్ అధ్యాపకులు రామకృష్ణకు డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఇన్ స్టిట్యూషన్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ (నిప్స్) కళాశాల అధ్యాపకులు ఎం.రామకృష్ణ డాక్టరేట్ అందుకున్నారు. ఫార్మస్యూటికల్ ఎనాలసిస్ విభాగంలో డెవలప్మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ స్పెక్ట్రోఫోటో మెట్రిక్ అండ్ ఆర్ పి హెచ్ పి యల్ సి మెథడ్స్ ఫర్ ది డిటర్మనేషన్ ఆఫ్ బల్క్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్ డోసెజ్ ఫామ్స్ అనే అంశం పై ఇంప్యూరిటి ప్రొఫైల్ డ్రగ్ అనాలసిస్ చేసినందుకు కెరీర్ పాయింట్ యూనివర్సిటి రాజస్థాన్ నుండి డాక్టరేట్ పట్టా పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెఎన్.సురేష్ కుమార్ తెలి పారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు రామకృష్ణని సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిఇ అమలు చేయని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థలలో ఉచిత సీట్లు వచ్చినా ఇంత వరకూ జాయిన్ చేసుకోని విద్యాసంస్థల గుర్తిపును రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్ ఒక ప్రకటనలో కోరారు. ఆర్.టి.ఇ చట్టం సెక్షన్12(1)(సి) ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల పిల్లలకు ప్రభుత్వం ఉచిత అడ్మిషన్లు ఇచ్చినా యాజమాన్యాలు స్పందించకపోవటం సరికాద న్నారు.కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఒక యూనియన్‌గా ఏర్పడి ఈ చట్టాన్ని అమలు చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నాయన్నారు. జూన్ 12న విద్యాసంస్థలు ప్రారంభకాగానే విద్యార్థులను చేర్చుకోవాల్సి ఉన్నప్పటికీ ఇంత వరకు చేర్చుకోలేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి ఆర్.టి.ఇ చట్టాన్ని అమలు చేయని విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని పిల్లల భవిష్యత్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు

యోగాసనాలు వేస్తున్న భాష్యం రామకృష్ణ, విద్యార్థులు

యోగాతో మానసిక ధృఢత్వం

ప్రజాశక్తి-గుంటూరు

యోగాతో శారీరక ఆరోగ్యం తోపాటు మానసికంగా ధృఢత్వం ఏర్పడుతుందని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. యోగాంధ్రలో భాగంగా భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు యోగోత్సవ్ పేరిట నిర్వహించనున్న యోగా కార్యక్రమాన్ని మొదటి రోజు లాంఛనంగా ఇన్నర్ రింగు రోడ్డులోని భాష్యం గరుడ క్యాంపస్‌లో గురువారం రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం యోగాను ఆచరించి అద్భుతమైన ఫలితాలను పొందుతున్నాయన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత అలవడుతుందన్నారు. విశ్రాంత వ్యాయామ శిక్షణాధికారి ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యా ర్థులు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేస్తే ఏకాగ్రత, లక్ష్యసాధనలో ఉన్నత ఫలితాలను సాధించవచ్చన్నారు. మనసును స్థిరంగా ఉంచడానికి యోగా ఎంతో ఉపకరిస్తుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రాణాయామ, యోగాసనాల అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. భాష్యం రామకష్ణ విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ పాల్గొన్నారు.

సాహితీవేత్త పులిచర్ల సాంబశివరావు కన్నుమూత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రఖ్యాత సాహితీవేత్త, జెకేసి కళాశాల ఆంధ్ర (తెలుగు) అధ్యాపకులు, విభాగాధిపతిగా పదవీ విరమణ చేసిన డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు (78) అనారోగ్య కారణాల రీత్యా గురువారం ఉదయం గుంటూరులో స్వగృహంలో కన్నుమూశారు. సాహిత్యంపై భారతితో సహా పలు పత్రికలలో వ్యాసాలు వ్రాసిన ఆయన అనేక చారిత్రక గ్రంధాలను కూడా రచించారు. అక్బర్‌ను ఎదిరించి స్వాభిమానానికి భారతీయ పౌరుషానికీ ప్రతీకగా నిలిచిన మహారాణా ప్రతాప్ జీవితాన్ని నవల రూపంలో తెలుగు పాఠకులకు అందించారు. వీరపాండ్య కట్టబ్రహ్మన జీవితాన్ని వీరి అన్నగారు పులిచెర్ల సుబ్బారావు నాటక రూపంలో అందించగా, వీరు దానిని సులభంగా చదువుకోవడానికి వీలుగా నవలగా మలిచారు. మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ రచయిత మన్నవ గిరిధరరావు ప్రారంభించిన 'భారతీయ మార్గము' మాసపత్రిక నిర్వహణను కొనసాగించారు. ఆ పత్రిక మాధ్యమంగా రామాయణాన్ని సరళమైన భాషలో ప్రామాణికమైన రీతిలో తెలుగు పాఠకులకు అందించారు. అది గ్రంథరూపంలో ప్రచురితమైంది. జాతీయ సాహిత్య పరిషత్ తాండూరు శాఖ వారు ఓగేటి అచ్యుత రామశాస్త్రి జాతీయ సాహిత్య పురస్కారంతో ఆయనను సన్మానించారు. విజయవాడలో సమాలోచన నిర్వహించిన కథా రచయితల సమ్మేళనం సార్వజనిక సభకు సాంబశివరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. భద్రాచలంలో జాగృతి పత్రిక నిర్వహించిన కథా రచయితల సమ్మేళనంలోనూ ఆయన మార్గదర్శనం లభించింది. తుమ్మల సీతారామమూర్తి చౌదరి కళాపీఠం వారు ఆయన రచనలన్నిటినీ పునర్ముద్రణ చేయించారు. సాహితీ రంగానికి ఎన్నో విధాల , ఎంతగానో సేవ లందించిన సాంబశివరావుకు ప్రముఖ రచయిత, జాగతి' మాజీ సంపాదకులు వడ్డీ విజయ సారధి తెలుగు సాహితీరంగం తరఫున శిరసువంచి శతశత ప్రణామాలు సమర్పించారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 9 గంటలకు బొంగరాలబీడు, పితవనం మహాప్రస్థానంలో నిర్వహిస్తామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజధానిలో మొక్కలకు డ్రోన్లతో వర్మీవాష్

ప్రజాశక్తి - తుళ్లూరు

వర్షాకాలం ప్రారంభమైన నేపధ్యంలో రాజధాని అమరావతిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఎడిసి) మొక్కలకు పోషకాలు అందించే ప్రక్రియకు గురువారం శ్రీకారం చుట్టింది. అమరావతికి ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు)కు ఇరువైపులా ఉన్న పూల మొక్కలకు అధికారులు డ్రోన్ల ద్వారా వర్మీవాష్ చేస్తున్నారు. ఆర్గానిక్ పోషకాలను మొక్కలకు అందించడానికి ఈ వర్మీవాష్ తోడ్పడుతుంది. ముఖ్యంగా డ్రోన్ల ద్వారా పిచికారీ చేయటం ద్వారా మొక్క పై నుంచి కింది భాగం వరకు పోషకాలు అందించవచ్చు. సుమారు 10 కి.మీ మేర వర్మీవాష్‌ను అధికారులు పూర్తిచేశారు. త్వరలో ఎన్-9 రోడ్డుపై కూడా వర్మీవాష్ ప్రారంభిస్తారు. రహదారి మధ్యన, రహదారికి ఇరువైపులా వర్మీవాష్ చేయటం ద్వారా పూలు అందంగా పూయటంతో పాటు అమరావతి రహదార్లు ఆకర్షణీయంగా ఉంటాయని ఎడిసి అధికారులు చెప్పారు.

ప్రజావసరాలకు అనుగుణంగా శంకర్ విలాస్ బ్రిడ్జి : మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజలు చిరకాలంగా ఎదురుచూస్తున్న శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో ప్రజల ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని అన్ని జాగ్రత్తలతో నిర్మిస్తామని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ బెటర్ శంకర విలాస్ ఫ్లై ఓవర్ నాయకులు నగర మేయర్‌ను స్థానిక అశోక్ నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం ప్లాన్‌లో కొన్ని ఇబ్బందులు గుర్తించామని, సర్వీస్ రోడ్డుకు అవసరమైన 30 అడుగుల మేర విస్తరిస్తామని ఆర్ యుబి నిర్మాణం అవసరమని గుర్తించామని అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామని తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఎల్.ఎస్.భారవి మాట్లాడుతూ బహుళ ప్రయోజనాలను, భవిష్యత్ తరాల అవసరాలను తీర్చే విధంగా ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దష్టిలో పెట్టుకుని ముందుగా ఆర్‌యుబి నిర్మించి, సింగల్ పిల్లర్ ఫ్లైఓవర్ హిందూ కళాశాల కూడలి నుండి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ నిర్మంచగలిగితే రాష్ట్ర రాజధాని అమరావతిలో ముఖ్య పట్టణమైన గుంటూరు 100 సంవత్సరాల భవిష్యత్తుకు టిడిపి, రాష్ట్ర ప్రభుత్వం దోహదం చేసిన వారవుతారని చెప్పారు. వినతి పత్రం అందించిన వారిలో ప్రముఖ ఆడిటర్ పివి మల్లికార్జునరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, అవధానుల హరి, ప్రజాలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్, పలువురు జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరప్రవృత్తిని బయట పెట్టుకున్న జగన్

మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసులు విధించిన ఆంక్షలను పట్టించుకోకుండా మాజీ సిఎం జగన్ ఏడు గంటలపాటు జిల్లాలో ప్రదర్శన నిర్వహించారని చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గుంటూరులోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు నుంచి రెంటపాళ్ల వరకు ర్యాలీ పేరుతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించారన్నారు. చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని ఏడాది తరువాత పరామర్శించే నాయకుడ్ని జగన్‌నే చూస్తున్నామన్నారు. రెంటపాళ్ల పర్యటన పేరుతో జగన్ పల్నాడు ప్రజలపై యుద్ధం ప్రకటించినట్లు ఆయన ఆరోపించారు. బెట్టింగ్‌లు కాసి నష్టపోయిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడితే పోలీసుల వేధింపులని జగన్ కొత్త భాష్యం చెబుతున్నారని అన్నారు. ఒక వైపు సన్మానాలు చేయించుకుంటే మరో వైపు ప్రత్యర్థులను నరుకుతాం.. చంపుతాం అంటూ ప్లకార్డులను పట్టుకుని ర్యాలీలు నిర్వహించడం వైసిపికి చెల్లిందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన జగన్‌లో మార్పు లేదన్నారు. నాగమల్లేశ్వరరావు బెట్టింగ్‌లో ఓడిపోవడానికి జగన్ కారణం అన్నారు. వైసిపి నాయకులు అంబటి రాంబాబు తదితరులు బారికెడ్లు తొలగించి నిబంధనలు ఉల్లఘించారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లు ఒక సామాజిక వర్గంపై విషం చిమ్మిన జగన్ ఇప్పుడు వారిపై కపట ప్రేమ కనబరుస్తున్నారని అన్నారు. ఒక సామాజిక వర్గం నాయకుల చేత అదే సామాజిక వర్గం నాయకులను తిట్టించి ఆనందం పొందడం జగన్ నైజం అన్నారు. అమరావతిని నాశనం చేయడం వెనుక జగన్‌కు ఉన్న ఏకైక ఏజెండా కులాలపై ఉన్న ధ్వేషమేనని అన్నారు.

తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గపరిధిలో రూ.75.50లక్షలతో వివిద అభివద్ధి పనులు నిర్వహించడానికి గురువారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి శంకుస్థాపన నిర్వహించారు. నియోజకవర్గంలోని 50, 4వ డివిజన్ పరిధిలోని త్రాగునీటి పైపులున్లు, సిసి రోడ్లు, సిసి డ్రైన్లు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు శివారు ప్రాంతాలలో ప్రధానంగా త్రాగునీరు, రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుకు ప్రత్యేక యాక్షన్‌ప్లాన్ మేరకు ఇప్పటికే కౌన్సిల్, స్టాండింగ్ కమిటీ సమావేశాలలో అభివద్ధి పనుల నిర్వహణకు అనుమతులు మంజూరు చేశామన్నారు. నగరంలో డివిజన్ల వారీగా కార్పొరేటర్ల నుండి వసతులపై ప్రతిపాదనలు తీసుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, సదరు పనులనన్నింటిని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దశల వారీగా పనులు నిర్వహిస్తున్నామని తెలియచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజీల, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు ఈ.ఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

23న వెలగపూడిలో 'సుపరిపాలన - స్వర్ణాంధ్ర' సభ

హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - తుళ్లూరు

వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో ఈ నెల 23 వ తేదీన 'సుపరిపాలన -స్వర్ణాంధ్ర' జరగనుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం సాయంత్రం సి ఆర్ డి ఎ కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు,జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి,ఎస్ పి సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజ , సిఆర్‌డి ఎ అడిషనల్ కమిషనర్ నవీన్ కుమార్, పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాటుకు సంబంధించి చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నిర్దేశించిన మేరకు అధికారులు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంకా గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు , తుళ్ళూరు డిఎస్పీ మురళీకృష్ణ, మండల డిప్యూటీ తహశీల్దార్ వసంత రావు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఆర్ డిఎ కమిషనర్ కన్నబాబు,జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు